క్లుప్తంగా

'ఆది కర్మయోగి'తో మేలు



మాట్లాడుతున్న నీతి అయోగ్ ప్రతినిధి సందీప్

హిరమండలం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆది కర్మయోగి కార్యక్రమంతో గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుందని నీతి అయోగ్ ప్రతినిధి సందీప్ అన్నారు. మండలంలోని మర్రిగూడ గిరిజన గ్రామంలో గ్రామసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆది కర్మయోగి ద్వారా గిరిజన గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీపీవో సతీష్ కుమార్, ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్ పనులు



ఇల్లయ్యగారిపేట వద్ద జంగిల్ క్లియరెన్స్ చేపడుతున్న దృశ్యం

పొందూరు: మండలంలో రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో జేసీబీతో జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయని ఆర్అండ్‌బీ ఏఈ పీటీ రాజు తెలిపారు. రాపాక కూడలి నుంచి కింతలి వరకు ఉన్న మలుపుల వద్ద ఏపుగా పెరిగిన మొక్కలను, పొదలను తొలగిస్తున్నామన్నారు. ఈ పనులు కింతలి వరకు చేస్తామని చెప్పారు. ఇప్పటికే వావిలపల్లి కూడలి నుంచి వావిలపల్లి మోడల్ స్కూల్ వరకు పనులు చేశామని వెల్లడించారు. అలాగే పొందూరు నుంచి చిలకపాలెం వరకు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్నామన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించాలని పాతపట్నం సహాయ సంచాలకుడు డాక్టర్ మంచు కరుణాకర్ తెలిపారు. మండలంలోని కొసమాల గ్రామంలో టీకా ప్రక్రియను శనివారం పరిశీలించారు. గాలికుంటు వ్యాధి పాల ఉత్పత్తిని తగ్గించి పాడి రైతుకు నష్టాన్ని మిగుల్చుతుందన్నారు. 12,000 పశువులకు టీకాలు వేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు 8,598 పశువులకు వేశామన్నారు. ఈనెల 15వ తేదీ వరకు టీకా ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు



వసప గ్రామంలో బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని వంశధార నది వరద నీరు వచ్చిన గ్రామాల్లో ఎంపీడీవో నీరజ ఆదేశాల మేరకు ఆయా పంచాయతీల సర్పంచ్‌ల ఆదేశాలతో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగు నీరు ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. వర్షాలు కురుస్తున్నందున పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అంటురోగాలు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జీఎస్టీ తగ్గుదలతో డబ్బులు ఆదా



జీఎస్టీ 2.0 కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో ప్రజలకు డబ్బులు ఆదా అవుతాయని మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో జీఎస్టీ 2.0 అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా పురపాలక సంఘం ఆవరణలో ఆప్కో వస్త్రాలు, ఆర్కే సోలార్ టెక్ సొల్యూషన్స్ ఉమ్మడి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఖాదీ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించడమే కాకుండా, దేశీయ ఉత్పత్తుల కొనుగోలును పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఖాదీ వస్త్రాలపై జీఎస్టీ తగ్గించడంతో చిన్న వ్యాపారులు, వినియోగదారులకు లాభం చేకూరుతోందన్నారు. అనంతరం ఆర్కే సోలార్ టెక్ సొల్యూషన్స్ సిబ్బంది సౌర పరికరాలపై డిస్కౌంట్లను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రోణంకి వెంకట్రావు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఇంకా ముంపులోనే..!



హిరమండలం: నీట మునిగిన వరి దుబ్బును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



బూర్జ: మామిడివలస వద్ద నీట మునిగిన వరిచేలు



జలుమూరు: తాళ్లవలస వద్ద నీట మునిగిన పంట పొలాలు



మెళియాపుట్టి: కృష్ణసాగరం కరకట్ట గండి పూడ్చుతున్న దృశ్యం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా పెరిగిన వరద ఉధృతి క్రమేపీ తగ్గుతోంది. అయితే పంట పొలాలు, లోతట్టు ప్రాంతాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. వంశధార, నాగావళి, మహేంద్రతనయ నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. నదులు, చెరువుల వైపు వెళ్లవద్దని ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. పంట పొలాలు ముంపులోనే ఉండడంతో నష్టం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పంట పొలాలను పరిశీలిస్తున్నారు. రైతులు పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను వివరిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: నీట మునిగిన పొలాల్లో వరి దుబ్బులను చూపుతున్న రైతులు



బూర్జ: చీడివలస - నారాయణపురం గ్రామాల మధ్యలో నీట మునిగిన పొలాలు పరిశీలిస్తున్న చింతాడ రవికుమార్ తదితరులు



బూర్జ: అల్లెన గ్రామం వద్ద వరిచేలు పరిశీలిస్తున్న ఏవోడీ ఉషారాణి తదితరులు



ఆమదాలవలస: అల్లెన వద్ద ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



నరసన్నపేట: మామిడివలస పంటలను పరిశీలిస్తున్న అధికారులు




పాతపట్నం: హరిజన గోపాలపురం వద్ద నీట మునిగిన పంట పొలాలు



పాతపట్నం: రోమదల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గుమ్మగెడ్డ



పాతపట్నం: నీలకంఠేశ్వర స్వామి ఆలయం గర్భగుడిలోకి చేరిన వరద నీరు



పాతపట్నం: మహేంద్రతనయ నది పరవళ్లు



బూర్జ: అల్లెన వద్ద నాగావళి ప్రవాహం



ఆమదాలవలస: పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిల్వ ఉన్న వరద నీరు



ఆమదాలవలస: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో...



కొత్తూరు: పొనుటూరు వద్ద రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ బాలకృష్ణ



కొత్తూరు: వసప గ్రామంలో పంటలను పరిశీలించిన జేడీ త్రినాథస్వామి

బాధితులను ఆదుకోవాలి



నరసన్నపేట: కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న కృష్ణ చైతన్య

నరసన్నపేట: ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య కోరారు. మండలంలోని గెడ్డవానిపేట గ్రామంలో కోతకు గురైన రోడ్డును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంశధారకు అధికంగా నీరు రావడంతో ఎక్కువ నష్టం జరిగిందన్నారు. గెడ్డవానిపేట రక్షణకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీట మునిగిన పంటను గుర్తించి నష్ట పరిహారం అందించడంతో పాటు పెట్టుబడి రాయితీ ఇవ్వాలన్నారు. ఆయనతో పాటు ఎంపీపీ ఆరంగి మురళి, మాజీ జెడ్పీటీసీ చింతు రామారావు, ఎంపీటీసీ శ్రీరాములు, వైఎస్సార్ సీపీ నాయకులు అప్పన్న, లుకలాపు రవి, అంపోలు సుధ తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు: ఇటీవల కురిసిన వర్షాలకు అందవరం పంచాయతీ రామకృష్ణాపురంలో రేగాన తులసమ్మకు చెందిన ఇల్లు కూలిపోయింది. దీంతో ఆమెను ధర్మాన కృష్ణ చైతన్య శనివారం పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వపరంగా పరిహారం అందేలా అధికారులతో మాట్లాడతానని తెలిపారు. ఆయనతో పాటు ఎంపీపీలు వాన గోపి, ఆరంగి మురళీ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఎం.శ్యామలరావు, చింతు రామారావు, నరసన్నపేట పార్టీ అధ్యక్షుడు లుకలాపు రవి కుమార్, స్థానిక నాయకులు రేగాన శ్యామ్, నడుపూరి గోవిందరావు, పిట్ట ప్రసాద్, పి.తవిటినాయుడు, తాడేల త్రినాథరావు, కె.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

రహదారికి అడ్డంగా పడిన చెట్టు



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు

మెళియాపుట్టి: మండలంలోని కొళిగాం పంచాయతీ పరిధి సవర కొళిగాం గ్రామానికి వెళ్లే రహదారిలో రోడ్డుకి అడ్డంగా చెట్టు పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు శనివారం చెట్టు నేలకొరిగిపోయింది. గ్రామస్తులు కొంతమంది చెట్టును ముక్కలుగా చేసి తొలగించారు.

పట్టుబడిన పేకాటరాయుళ్లు

ఆమదాలవలస: పట్టణ శివారులోని సొట్టవానిపేట వద్ద శనివారం ఆమదాలవలస ఎస్ఐ ఎస్.బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో ఆరుగురు పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. ఎస్ఐ బాలరాజుకు వచ్చిన సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. దీనిలో భాగంగా లింగుబేరి రవిప్రసాద్, లింగుబేరి ధర్మారావు, లబ్బ కృష్ణారావు, లింగుబేరి రామ్మోహన్, లింగుబేరి మోహన్, లింగుబేరి రామకృష్ణలు పేకాట ఆడుతుండగా పట్టుకొని, వారి వద్ద నుంచి రూ.9,050ల నగదు, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు దారుణం

సరుబుజ్జిలి: చిత్తూరు జిల్లా దేవళంపేట గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడం దారుణమని ఆలిండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ మెంబర్ రావాడ వెంకటరావు శనివారం ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. జాతి గర్వించదగ్గ మహనీయుడి విగ్రహానికి ఈవిధంగా చేయడం క్షమించరాని విషయమన్నారు. దీనికి బాధ్యులైనవారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని దళిత సంఘాల నేతలు ఎడ్ల ఈశ్వరరావు, అదపాక గౌరినాయుడు, ఇల్లాకుల ప్రకాషరావు, ఎండ కృష్ణ, గొండేల సింహాచలం, శంకరరావు, పుచ్చ రాజారావు తదితరులు డిమాండ్ చేశారు.

హామీలు అమలు చేయాలి



పోలాకి: బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న దిలీప్‌కుమార్



కొత్తూరు: బైక్ ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పోలాకి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఉపాధ్యాయ సంఘాల వేదిక ప్యాప్టో అధ్వర్యంలో బైక్ ర్యాలీ శనివారం నిర్వహించారు. పెండింగ్ డీఏల చెల్లింపులో జాప్యం తగదన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగుల మద్దతు కోరారు. మౌనంగా ఉంటే ప్రభుత్వం నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు రావాల్సిన హక్కులు సైతం ఇచ్చే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్తూరు: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 7వ తేదీన నిర్వహించనున్న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్, ఫ్యాప్టో నాయకులు దండు ప్రకాష్‌రావు, కె.కాంతారావులు కోరారు. ఈ మేరకు స్థానిక విద్యాశాఖ కార్యాలయం నుంచి కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఉపాధ్యాయులకు బోధనేతర విధుల నుంచి తప్పిస్తామని చెప్పిన కూటమి నేతలు, అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్ వేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడం దారుణమన్నారు. పాత పింఛన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌరీశంకరరావు, బాలరాజు, రవి, లోకేష్, చంద్రమౌళి, రమణమూర్తి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పీరుకట్ల విశ్వప్రసాదరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



పీరుకట్ల విశ్వప్రసాదరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు

బూర్జ: మండలంలోని తోటవాడ పంచాయతీ టీఆర్‌రాజుపేట గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు మాతృమూర్తి పీరుకట్ల శ్యామసుందరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వీరి కుటుంబాన్ని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌లు శనివారం వేర్వేరుగా పరామర్శించారు. అలాగే కొల్లివలస గ్రామంలో నున్నగొప్పల తవిటినాయుడు, సైరిగాపు మురళిలు మరణించడంతో వీరి కుటుంబాలను తమ్మినేని సీతారాం, చింతాడ రవికుమార్‌లు పరామర్శించారు. వారితో పాటు ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురం రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, కొల్లివలస సర్పంచ్ జీడి వేణు, సైరిగాపు శివ, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి గోవిందరావు, వైయస్సార్‌సీపీ మండల కార్యదర్శి సాకేటి శ్రీనివాసరావు, తోటవాడ సర్పంచ్ సూర ఆనందరావు, గుంద్రు సుధాకర్, ఉప సర్పంచ్ గండేవలస వెంకటరమణ, మండల యూత్ అధ్యక్షుడు మామిడి శ్రీనివాసరావు, ఎం.కరణ్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో దేవీ నిమజ్జనం



హిరమండలం: ఎల్ఎన్‌పేటలో నిమజ్జన ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం



సారవకోట: నిమజ్జనానికి తరలి వెళ్తున్న అమ్మవారు

దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకొని ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనాలు పలుచోట్ల శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి విగ్రహాలకు గ్రామాల్లో ముందుగా శోభయాత్ర నిర్వహించారు. అనంతరం సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: మెట్టూరు బిట్-1లో అమ్మవారిని ఊరేగిస్తున్న భవానీ స్వాములు

యూరియా కొరత ఇంకెన్నాళ్లు..?

• సర్వసభ్య సమావేశంలో నిలదీత



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పోలాకి: యూరియా కొరత ఇంకెన్నాళ్లో చెప్పాలని, ఆఖరి ఎరువు అయినా సక్రమంగా అందించే ప్రయత్నం చేయాలని మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ దమయంతి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా వ్యవసాయ శాఖ గురించి చర్చకు వచ్చే సమయంలో సభ్యులు యూరియా పంపిణీపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంతటి దారుణం ఎన్నడూ చూడలేదని, యూరియా అందించలేని పరిస్థితి ఉన్నా కొరత లేదని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే మండలంలో సాగు విస్తీర్ణానికి సరిపడా యూరియా సరఫరా జరిగిందని వ్యవసాయశాఖ సిబ్బంది తెలిపారు. సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన పథకాలు, వాటి అమలు తీరును అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలతో పార్టీ బలోపేతం



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణ చైతన్య

సారవకోట: గ్రామ కమిటీలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయనున్నట్లు పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య తెలిపారు. మండలంలోని అలుదు గ్రామంలో మూడు పంచాయతీల గ్రామస్థాయి కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులతో 'కార్యకర్తలతో కృష్ణ చైతన్య' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పంచాయతీ, సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన డిజిటల్ బుక్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళీ, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బగ్గు రామకృష్ణ, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, పార్టీ జిల్లా కార్యదర్శి యాళ్ల శ్యామసుందరరావు, నాయకులు బాడాన కృష్ణారావు, మామిడి కాంతారావు, పల్లి కృష్ణారావు, దండాశి, పారశెల్లి తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.